క్లుప్తంగా

నేడు మేకపాటి విజయ సంకల్పయాత్ర

కలిగిరి: మండలంలోని గుడ్లదొన సచివాలయం పరిధిలోని తూర్పుగుడ్లదొన, పడమర గుడ్లదొన, ఎరుకులరెడ్డిపాళెం పంచాయతీల్లో శనివారం ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కాటం రవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

18 నుంచి ఒంటి పూట బడులు

ఉదయగిరి: మండలంలో ఈ నెల 18వ తేదీ నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించి మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు.

నేడు ఎమ్మెల్యే విజయీభవ యాత్ర

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహిస్తారని మేకపాటి కార్యాలయం ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆరవీడు, 5 గంటలకు ఆరవీడు జంగాలపల్లి, 6 గంటలకు గొల్లపల్లి, 7 గంటలకు బోయలచిరివెళ్ల గ్రామాల్లో విజయీభవ యాత్ర జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఉదయగిరి: దుత్తలూరు మండలం కమ్మవారిపాళెం సొసైటీలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అధికారులు ప్రారంభించారు. సొసైటీ పరిధిలోని నర్రవాడ ఆర్బీకేలో మరో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విక్రయించుకోవచ్చన్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యశోధ, ఏఓ ఎస్.వెంకటసుబ్బారెడ్డి, సొసైటీ సీఈఓ లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ పోలీస్ ఫోర్స్ కవాతు



సెంట్రల్ పోలీస్ ఫోర్స్‌తో కలిసి కవాతు నిర్వహిస్తున్న ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి

మర్రిపాడు: మర్రిపాడులో స్థానిక ఎస్సై విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సెంట్రల్ పోలీస్ ఫోర్స్ స్థానిక పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సెంట్రల్ పోలీసు ఫోర్స్‌తో రక్షణ కల్పించే దిశగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో నిర్భయంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. శనివారం మర్రిపాడు, తిక్కవరం, పల్లవోలు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నువ్వు పంట ధ్వంసంపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: సాగులో నువ్వు పంటను గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేసిన ఘటనపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని చౌటభీమవరం పంచాయతీ సంపత్‌నగర్‌కు చెందిన చల్లా రమణమ్మ గ్రామంలో 15 ఎకరాలు భూమిని లీజుకు తీసుకుని నువ్వు పంట సాగు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం భూమిని దుక్కి చేసిన ట్రాక్టర్ యజమాని దుక్కి చేసిన డబ్బులు అడగడంతో వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రెండు రోజుల తర్వాత శుక్రవారం ఆమె పొలంలోకి వెళ్లి చూడగా పంట ధ్వంసమై ఉండడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఇప్పటికే రూ.1.50 లక్షలు పంట కోసం ఖర్చు చేసినట్లు ఆమె బోరున విలపించారు. పంట చేతికొచ్చే సమయానికి ఇలా నేల పాలు కావడంతో ఆమె కన్నీటి పర్యంతమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

అన్న కంటే మిన్నగా ఆదుకున్న జగనన్న



పట్టాలను పంపిణీ చేస్తున్న బీద మస్తాన్‌రావు

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు

అల్లూరు: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, సమాజంలో సమానత్వం రావాలని గత ఏడు దశాబ్దాలుగా పాలకులు చెబుతూనే ఉన్నారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల స్వావలంబనను ఆచరణలో చేసి చూపించారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటే.. ఈ ప్రభుత్వం ప్రజాధనాన్ని ప్రజల అభివృద్ధికి ఉపయోగించిందని గుర్తు చేశారు. ప్రతి మహిళ గత ప్రభుత్వ పాలనకు.. ఈ ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం బీద మస్తాన్‌రావు తన స్వగ్రామం ఇస్కపల్లిలో మహిళలకు ఇంటి పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కపల్లిలో ఇల్లు లేని నిరుపేదలకు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎకరా భూమిని రూ.18 లక్షల చొప్పున 8 ఎకరాలను తన సొంత డబ్బులతో కొని 302 మంది అర్హత కలిగిన పేదలకు పట్టాలుగా పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి వార్షిక క్యాలెండర్ ప్రకారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల నగదును జమ చేస్తున్నారన్నారు. అన్నకంటే మిన్నగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదిస్తే.. ప్రతి మహిళ ధనవంతులుగా మారుతారన్నారు. జగన్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల వల్ల రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. 2024 ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా పోటీ చేయనున్న తన స్నేహితుడు విజయసాయిరెడ్డిని, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు అందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్ ఎంపీపీ సురేంద్ర, సర్పంచ్ రంజిత్‌కుమార్, నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్, కొండూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత బోధన అందించడమే లక్ష్యం



ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి విద్యా సంస్థల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు ఆర్ఎస్సార్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. ముసునూరు సమీపంలోని ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన బోధన అందించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అత్యున్నత ప్రమాణాలతో గ్రామీణ ప్రాంతాల్లోనే ఆర్ఎస్సార్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడనూతల వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ద్వారా వేలాది మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా మారి బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. ముసునూరు వద్ద ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్న సమయంలో కూడా చాలా మంది కావలి పట్టణం లేదా ఏదైనా మంచి మెట్రో పాలిటిన్ సిటీలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పినా.. గ్రామీణ విద్యార్థుల కోసం ముసునూరులోనే అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా సృజనాత్మకతను పెంపొందించేలా, పోటీ తత్వాన్ని ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో అభివృద్ధి పనుల ప్రారంభం



ఈద్గాలో బోరు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉదయగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఈద్గా మసీదు మౌలానా సయ్యద్ అఫ్రోజ్ ప్రారంభించారు. ఈద్గాలో బోరుతో పాటు ప్రహరీ నిర్మాణానికి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రంజాన్ ముగిసేలోపు ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. మసీదు కమిటీ ఎంపీపీ మూలె పద్మజకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, ఎంపీటీసీ పెదమస్తాని, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్సి ఎస్దాని, ఉప్పుటూరి శ్రీనివాసులు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి రూ.20 వేలు సాయం



బాలుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

ఉదయగిరి: మండలంలోని చింతలగుంటలో ఇటీవల పాముకాటుతో మృతి చెందిన దుగ్గినబోయిన శివరామకృష్ణ కుటుంబ సభ్యులకు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని ఏరుకొల్లు పంచాయతీకి చెందిన పెయ్యల జయమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, చేజర్ల బ్రహ్మారెడ్డి, శ్రీహరి, దనాల రవి పాల్గొన్నారు.

మేకపాటి విజయానికి కృషి



మేకపాటిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

ఉదయగిరి: ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించేందుకు తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పలువురు కాలనీవాసులు చెప్పారు. శుక్రవారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటిని అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకెంతో మేలు జరిగిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని ఆయనకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, దాసరపల్లి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, నాయకులు పెంచలయ్య తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల ఆర్థికాభివృద్ధి



చేయూత చెక్కులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్, తదితరులు

కావలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేయూత పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కావలి పట్టణం, రూరల్ మండలాల్లోని మొత్తం 7476 మంది లబ్ధిదారులకు సుమారు రూ.14.01 కోట్లను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా బలహీనంగా ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఆర్థిక భరోసా అందించేలా ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ.75 వేలు వంతున ఇచ్చారని తెలిపారు. వైఎస్సార్ చేయూత మాత్రమే కాకుండా మహిళలకు, పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం భారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మేకపాటి

ఉదయగిరి: రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా ఉదయగిరి ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపి వారితో కలిసి ఇఫ్తార్ పూర్తి చేశారు.

సీఎంకు రుణపడి ఉంటాం

ఆత్మకూరు: వలంటీరుగా విధులు నిర్వహిస్తున్న తమ కుమారుడు కారమనేని వెంకట సాయి మృతి చెందడంతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేయడంపై అతని తల్లిదండ్రులు శ్యామలగౌరి, తిరుపతయ్య శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా వలంటీరు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేసిన విషయం తెలిసిందే.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సోమశిల: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన బొగ్గవరపు రమణయ్య (58) నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రమణయ్య ఇటీవల చికిత్స చేయించుకున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న అనంతసాగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనుమరాలిపై తాత కొడవలితో దాడి



చికిత్స పొందుతున్న స్వప్న

ఆత్మకూరు: ఆస్తి వివాదం నేపథ్యంలో వరసకు తాత అయ్యే (చిన్న తాత) వ్యక్తి మనుమరాలిపై కొడవలితో దాడికి పాల్పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. పట్టణంలోని కందివీధికి చెందిన శేషగిరి, సుకన్య కుమార్తె స్వప్నకు వివాహమై భర్తతో కలిసి తన తల్లిదండ్రులకు ఇంటికి ఎదురుగా మరొక ఇంట్లో ఉంటోంది. అయితే తన తండ్రి శేషగిరికి, ఆయన చిన్నాన్న ఆత్మకూరు వెంకటేశ్వర్లు మధ్య పొలం వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి వాకిట్లో కూర్చొని ఉన్న స్వప్నను మీ నాయన ఏడి అంటూ కేకలు వేస్తూ వచ్చి కొడవలితో దాడి చేశాడు. దీంతో ఆమె మెడ, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు రావడంతో వెంకటేశ్వర్లు పరారయ్యాడు. స్వప్నను బంధువులు వెంటనే ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మండలంలోని సంఘబంధ సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై ఏపీఎం ఖాజారంతుల్లా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతు సాధికారిత సంస్థ సహకారంతో సంఘబంధ సభ్యులు గ్రామాల్లో పురుగు మందుల్లేని సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసేలా అవగాహనా సదస్సులు నిర్వహించి రైతులను చైతన్య పరచాలన్నారు. సీసీలు తరచూ సదస్సులను పర్యవేక్షిస్తూ సభ్యులకు సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో జగన్‌తోనే వెలుగులు సాధ్యం



ఉపాధి పనులు చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): రాష్ట్రంలోని పేదల బతుకులు మారాలన్నా, వీరి జీవితాల్లో వెలుగులు నిండాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వింజమూరులోని యర్రబల్లిపాళెం చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ 58 నెలల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పేదల బతుకుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని, మరో రెండు దఫాలు జగనన్నను సీఎంగా చేసుకుంటే దాదాపు పేదరికం నుంచి దూరం కావచ్చన్నారు. ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి త్వరలో జరగబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. టీడీపీ మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు తప్పుడు వాగ్దానాలు చేస్తోందని, వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ కూటమి తప్పుడు హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయని విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే మోసపు మాటలతో ప్రజల ముంగిటకు వచ్చి మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో డబ్బుల మూటలతో వచ్చే వారిని నమ్మవద్దని, చెప్పిన మాట నిలబెట్టుకున్న వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని కోరారు. ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనం అందేలా చూస్తామన్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేవ్వూరు శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలున్నారు.

భూమి చదునును అడ్డుకున్న గ్రామస్తులు



యంత్రాలతో భూమిని చదును చేస్తున్న అటవీశాఖ అధికారులు

వరికుంటపాడు: మండలంలోని విరువూరులో అటవీశాఖ అధికారులు జేసీబీతో చేస్తున్న భూమి చదును పనులను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పశువుల మేత పోరంబోకు భూములను ఇరవై ఐదేళ్ల క్రితం అటవీశాఖ అధికారులు కొంత మేర స్వాధీనం చేసుకున్నారన్నారు. 2007లో ఈ విషయమై గ్రామస్తులు కోర్టును ఆశ్రయించగా జాయింట్ సర్వే చేసి గ్రామానికి సంబంధించిన పశువుల మేతపోరం బోకు భూములుగా వదిలి వేయాలని ఆదేశాలిచ్చారన్నారు. అప్పటి నుంచి ఇంత వరకు ఆ భూములను పట్టించుకోని అటవీ అధికారులు తాజాగా ఈ పనులు చేపట్టారని తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సత్కారం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

కావలి: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు సాధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి కావలికి తొలిసారి విచ్చేయంతో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి తమకు అండగా ఉంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శనం, జిల్లా నాయకులు నరసింహమూర్తి, మధుసూదన్, వెంకటేశ్వర్లు, సునీల్, కావలి పట్టణ అధ్యక్షుడు వై సురేష్, ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా పాల్గొన్నారు.


జగనన్న ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

అల్లూరు: జగనన్న లే అవుట్లలో కేటాయించిన ఇళ్ల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలను ఇవ్వడంతో పాటు వాటిని లబ్ధిదారుల మీదే రిజిస్ట్రేషన్‌ను చేసిస్తామని చెప్పిన విధంగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వో రంతుల్లా, నాయకులు ఉస్మాన్, సుధ, రసూల్, తాండ్ర మల్లి, నిమ్మల మనోహర్, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



పామంజి రమణయ్య (ఫైల్)

కావలి: మండలంలోని కొత్త సత్రం గ్రామానికి చెందిన 60 ఏళ్ల పామంజి రమణయ్య ఐదు రోజుల క్రితం అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వ్యక్తిగత పనులపై ఇంటి నుంచి వెళ్లిన రమణయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమణయ్య ఆచూకీ తెలిస్తే 9346566025, 7416091735, 8523079431, 80028124590 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం కూడా అందిస్తామన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ తెలిపారు. కృష్ణారెడ్డిపాళెం సచివాలయం పరిధిలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రావు లక్ష్మీనారాయణరెడ్డి, చుండి మనోహర్‌రెడ్డి, నలతాటి యాదగిరి, పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణారెడ్డి, వైద్యాధికారి మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల బాగు కోసం పరితపించే సీఎం జగన్



రాజగోపాల్‌రెడ్డికి హారతులిస్తున్న మహిళలు

• నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి

ఉదయగిరి: పేద ప్రజల కష్టాలు తెలిసిన, ఆ ప్రజల బాగు కోసం పరితపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నర్రవాడ, తెడ్డుపాడు పంచాయతీల్లో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. నర్రవాడ సెంటర్‌లో ఆయనకు మహిళలు మంగళ హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. నర్రవాడ సెంటర్ నుంచి వెంగమాంబ దేవస్థానం వరకు ర్యాలీగా వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం వెంగమాంబ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు జగన్ సంక్షేమ పథకాలు అందిస్తుంటే టీడీపీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు ప్రజలను మభ్య పెట్టేందుకు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి వారి మాటలు విని మళ్లీ టీడీపీకి ఓటేస్తే జన్మభూమి కమిటీల చేతిలో పేదలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుక్షణం ప్రజాసంక్షేమం కోసమే ఆలోచన చేస్తున్నారన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ప్రస్తుతం ఇస్తున్న నవరత్నాలు పథకాలతో పాటు శనివారం మరి కొన్ని పథకాలతో కలిపి మేనిఫెస్టో విడుదల చేసే అవకాశముందన్నారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ రకరకాల హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తుంటారని, అలాంటి వారిని నమ్మితే మళ్లీ ప్రజలకు కష్టాలు మొదలవుతాయన్నారు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఎత్తివేస్తారని, ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రజలు ఆలోచించి విజ్ఞతతో ఓటేయాలన్నారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ జగనన్నను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. తనను ఎమ్మెల్యేగా, విజయసాయిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, శ్రీహరినాయుడు, తిరివీధి చెన్నకేశవులు, పులివర్తి మాల్యాద్రి, పచ్చవ శ్రీనివాసులు, నూతంగి రామకృష్ణ, దేవరపాటి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.